క్లుప్తంగా

నిరుపయోగంలో బస్ షెల్టర్



మరమ్మతులకు గురైన బస్ షెల్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని విజయగోపాలపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో నిర్మించిన బస్‌షెల్టరు దుస్థితికి చేరుకుంది. దీన్ని మాజీ ఎంపీ వెంకటస్వామి ఎంపీ నిధులతో నిర్మించారు. బస్‌షెల్టరు గ్రామానికి దూరంగా ఉండడంతో కిటికీలను, కిందపరచిన నాపరాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ క్రమంలో బస్‌షెల్టరుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రం లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు బుధవారం ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి, లైన్ ఇన్‌స్పెక్టర్ చెంగల్‌రాయులు, లైన్‌మెన్ మునస్వామి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడంతో లోవోల్టేజీ సమస్య వస్తోందని, దీనిని అరికట్టానికి మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అకాల వర్షాలతో ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.

రక్త పరీక్షలు చేసుకోవాలి



ఏర్పేడు: క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుంటూ అందుకు అనుగుణంగా మందులు వాడితే మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మండలంలోని ఎండీపుత్తూరులో పాపానాయుడుపేట పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం గ్లైకోసైలేటెడ్ హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ బ్లడ్ టెస్ట్ ద్వారా రక్తం లోని చక్కెర స్థాయిని గుర్తించవచ్చని, తద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించుకోవచ్చన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, రోహిత, లహరి, ఏఎన్ఎం లలిత, ఆశ కార్యకర్త సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపునకు 40 మంది విద్యార్థినులు



తిరుపతి ఎన్‌సీసీ క్యాంపునకు హాజరైన పిచ్చాటూరు హైస్కూల్ ఫ్లస్ విద్యార్థినులు

పిచ్చాటూరు: తిరుపతిలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపులో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థినులు పాల్గొన్నట్టు ప్రధానోపాధ్యాయులు గిరిప్రకాష్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్‌సీసీ క్యాంపులకు బాలురు వెళ్లడం ఆనవాయితీగా ఉండేదన్నారు. బాలికలు హాజరుకావడం ఇదే తొలిసారన్నారు. గత ఏడాది నుంచి బాలికలకు ఎన్‌సీసీలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అలా శిక్షణ పొందిన 40 మంది ప్రస్తుతం క్యాంపులో పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ అమ్ములు, టీచర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



సూచనలు ఇస్తున్న ఈఓ నాగేశ్వర్‌రావు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా మండలంలోని ఊరందూరులో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఈవో కేవీ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఊరందూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహోత్సవాల ఏర్పాట్లును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఏఈవో సతీష్ మాలిక్, అనుబంధాలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయాధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఓటెత్తిన మహిళా లోకం

- మహిళలదే అధిక ఓటింగ్
- మొత్తం ఓటర్లు 2,15,385 మంది
- ఓటు వేసిన మహిళలు 93,839, పురుషులు 89,844 మంది
- నమోదైన పోలింగ్ శాతం 85.28



వరదయ్యపాళెం : ఎండను కూడా లెక్కచేయకుండా ఓటు వేయడానికి క్యూలో ఉన్న మహిళలు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో మహిళా లోకం ఓటెత్తింది. అమ్మఒడి, చేయూత, ఆసరా, ఇతర పథకాల ద్వారా మహిళలకు ఎనలేని మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇచ్చినట్టు సోమవారం ముగిసిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి చెబుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలోని మహిళలు ముందడుగు వేశారు. సోమవారం రాత్రి వరకు జరిగిన పోలింగ్‌లో పురుషుల కంటే అధికంగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తద్వారా సత్యవేడు అసెంబ్లీ సమరంలో విజేతను నిర్ణయించే శక్తిగా ఎదిగారు.

నిరీక్షించి మరీ..

వాస్తవానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో ఈవీఎం యంత్రాలు మొరాయించాయి. దీంతో పోలింగ్ ఆలస్యమైనా ఎండలో గంటల తరబడి నిరీక్షించి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలుచోట్ల సాయంత్రం ఓటేసేందుకు వచ్చిన చాలా మంది మహిళలు రాత్రి 9 గంటలు దాటినా సహనంతో క్యూలో నిల్చున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూడా మహిళలే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. నాటి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది.

ఓట్లు పెరిగినా పోలింగ్ శాతం అదే

2019 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం, తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం దగ్గరగా ఉండడం విశేషం. గత ఎన్నికల్లో సత్యవేడులో 86.44 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి దాదాపు ఒక శాతం తేడాతో అదే స్థాయిలో 85.28 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నుంచి 2,02,771 మంది ఓటర్లకు గాను 1,75,284 (86.44 శాతం) మంది ఓటేశారు. ఇందులో పురుషులు 86,525 మంది కాగా స్త్రీలు 88,757 మంది ఉన్నారు. తాజా ఎన్నికల్లో 2,15,385 మంది ఓటర్లకు గాను 1,83,683 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 89,844 మంది, స్త్రీలు 93,839 మంది ఉన్నారు. 3,995 మంది స్త్రీలు అత్యధికంగా ఈ ఎన్నికల్లో అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు.

వెంకన్న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సుగంధ ద్రవ్యాల మిశ్రమం ఊరేగింపులో అధికారులు, అర్చకులు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయాలను శుద్ధి చేసి గోడలను సుగంధ ద్రవ్యాలతో లేపనం చేశారు. ఈ నెల 21 నుంచి 29 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజలు, కైంకర్యాలు చేశారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, తిరుచూర్ణంతో కలిసిన మిశ్రమాలను మేళతాళాలతో ఆలయ అంతర ప్రాకారంలో పరిచారకులు ఊరేగించారు. అనంతరం వెంకన్న ఆలయంతో పాటు పద్మావతీ అమ్మవారు, గోదాదేవి గర్భాలయాల గోడలకు లేపనం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు గంట నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య నరసింహ భట్టాచార్య పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రేణిగుంట: అక్షయక్షేత్రంలో పండ్లు పంపిణీ

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం రేణిగుంటలో ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో పాత విమానాశ్రయ మార్గంలో ఉన్న అక్షయక్షేత్రంలో దివ్యాంగుల మధ్య కేక్ కత్తిరించి పంచిపెట్టారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. పార్టీ మండల వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, మండల కో–ఆప్షన్ సభ్యుడు హసన్, జాన్‌బాబు, వార్డు సభ్యులు కృష్ణమూర్తి, ఈశ్వరి, ఇన్బనాథన్, షణ్ముగం, రవి, షఫీ,రీహాన్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచారు. అలాగే రేణిగుంట మండలంలోని అక్షయక్షేత్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాయి యాదవ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఐతేపల్లి గురునాథం, కేశవులురెడ్డి, యువరాజు, యల్లప్పరెడ్డి, గిరి, దామోదరంరెడ్డి శశి, డిల్లీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణం గాండ్లవీధిలో పురాతన శ్రీరామాలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమి పూజ జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పూజల్లో పాల్గొని, కొబ్బరికాయ కొట్టి ఈ క్రతువును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కైలాసంగా ఖ్యాతిచెందిన శ్రీకాళహస్తిలో ఆధ్యాత్మికత దిశగా ప్రజలు మమేకం అయ్యారనేందుకు ఆలయాల నిర్మాణమే నిదర్శనమన్నారు. గాండ్ల సంఘం సభ్యులు, ప్రముఖులు రాజేంద్రప్రసాద్, రవి, గణేష్, సురేష్, విజయశేఖర్, చంద్రశేఖర్, మునిలక్ష్మి, గీత, లక్ష్మి, దేశమ్మ పాల్గొన్నారు.

పుంజుకుంటున్న నిమ్మ ధరలు

సైదాపురం: మూడు రోజులుగా నిమ్మకాయల ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. వంద నుంచి సైజును బట్టి రూ.140 ధర పలుకుతోంది. సైదాపురం మండలంలో రైతులు నిమ్మ పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రబీ సీజన్‌లో వరి పంటను సాగు చేసే రైతులు తర్వాత నిమ్మ, బొప్పాయి, మినుము, పెసర పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈఏడాది కూడా ఏప్రిల్, మే నెలల్లో దిగుబడి ఆశించిన స్థాయిలో ఉన్న కారణంగా ఆర్థికంగా బలపడ్డారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో నీటి ఖర్చులు తగ్గిపోయాయి. ఫలితంగా యాజమాన్యం పద్ధతులు సులువుకావడంతో లేత తో టలకు ప్రభుత్వం సూక్ష్మ సేద్యం కింద డ్రిప్, స్ప్రింకర్లు ఏర్పాటుకు రాయితీని పునరుద్ధరించడడంతో రైతులు ఎంతో సంతోషంగా సేద్యం చేస్తున్నారు. అధిక ధరలు లభిస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ఉపాధి పనుల్లో లక్ష్యాన్ని అధిగమించాలి



రావిళ్లవారికండ్రిగలో మస్టర్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు టార్గెట్‌ను అధిగమించాలని లేకుంటే ఇళ్లకు పంపుతామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పెన్నగడం, రావిళ్లవారికండ్రిగ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక పోవడంతో కూలీలు ఉపాధిహామీ పనులకు విరివిగా వస్తారన్నారు. సిబ్బంది కూలీలతో రోజూ మాట్లాడి అత్యధికంగా పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

పనుల ప్రదేశంలో వసతులు

పనుల్లో కొలతలను బట్టి కూలీలకు వేతనం లభిస్తుందని పీడీ తెలిపారు. గతంలో కూలీలకు రోజుకు రూ.272 వేతనం ప్రభుత్వం చెల్లిస్తుండేదన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి రోజు వేతనాన్ని రూ.300 పెంచినట్లు వివరించారు. ఎండతీవ్రత పెరుగుతుండడంతో ఉదయం 6 గంటలకు పనులు ప్రారంభించి 10 లోపు ముగించాలని తెలిపారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబా టులో ఉంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టేలా సిబ్బంది చొరవ చూపాలని తెలిపారు. ఏపీవో దేవరి, సీడీసీఎల్ఆర్సీ చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, క్షేత్ర సహాయకులు యతి శంకర్, చంద్రయ్య పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థతో విలువలు సాధ్యం



మాట్లాడుతున్న సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి

ఏర్పేడు: ప్రతి ఒక్కరూ కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకుంటే పురోగతి ఉంటుందని సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాగంపల్లి సమీపంలో ఉన్న ఎస్ఓఎస్ బాలల గ్రామంలో ఎస్ఓఎస్ఎఫ్ఎస్‌సీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల నుంచి సుమారు 80 మంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే మహిళల ప్రాధాన్యం చాలా కీలకమైందని వివరిం చారు. ప్రస్తుత సమాజ వ్యవస్థలో వచ్చిన ఆధునిక మార్పులతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థతో మానసిక పరిపక్వత, విలువలతో కూడిన నడవడిక సాధ్యమవుతుందని తెలిపారు. వ్యక్తి జీవితంలో కుటుంబం ప్రాముఖ్యత, వ్యక్తిత్వ వికాసంలో కుటుంబ పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓఎస్ఎఫ్ఎస్‌సీ లొకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సిబ్బంది మునిరత్నం జీనత్, మహిళలు పాల్గొన్నారు.

సత్యవేడు జాతర చాటింపు



గంగమ్మ దేవతకుకు నివేదించేందుకు పొంగళ్లు పెడుతున్న మహిళలు

- గంగమ్మకు అంబళ్లు..
- చల్లాతమ్మకు పొంగళ్లు
- సత్యవేడు జాతరకు వందేళ్లు



సదవాలమ్మగుడి వద్ద భక్తులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న అంబళ్లు

సత్యవేడు: జాతరలో భాగంగా బుధవారం ఉదయం గంగమ్మ గుడివద్ద చలువ పందిళ్లు వేసి గంగమ్మకు ఇళ్ల వద్ద నుంచి అంబలి తీసుకువచ్చి పెద్ద పాత్రల్లో పోసి కర్పూర హారతులు ఇచ్చి వేపాకు సమర్పించారు. మధ్యాహ్నం సదవాలమ్మ గుడి వద్ద పొంగళ్లు పెట్టారు. మే 29, 30 తేదీల్లో సత్యవేడులో జాతర నిర్వహిస్తారు. జాతరకు 15 రోజులు మునుపు చాటింపు వేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రాత్రి 8 గంటలకు అ మ్మవారి కలశం ఊరేగింపు అనంతరం బుధవారం జాతర చాటింపు వేశారు. జాతర సందర్భంగా గ్రా మంలో నలుదిక్కులలో పూజలు నిర్వహిస్తారు. రెండవ బుధవారం నడివీధి గంగమ్మ గుడి వద్ద అంబళ్లు పోస్తారు.

వందేళ్ల పైగా చరిత్ర

సత్యవేడు జాతరకు వందేళ్ల పైగా చరిత్ర ఉంది. సత్యవేడులో వెలసిన సదవాలమ్మ(గంగమ్మ) సృష్టిస్థితి లయలకు మూల కారకులైన శక్తికి ప్రతిరూపంగా ఇక్కడ ప్రజలు భావిస్తారు. భక్తిశ్రద్ధలతో ఏటా జాతర నిర్వహిస్తున్నారు. మత సామరస్యాలకు ప్రతీకగా సత్యవేడు జాతర జరుగుతోంది. జాతరకు చుట్టుపక్కల ఉన్న 50 గ్రామాలకుపైగా ప్రజలు హాజరవుతారు.



విద్యుత్ దీపాల అలంకరణ

జాతర చాటింపు సందర్భంగా సత్యవేడులోని మూడురోడ్ల కూడలి వద్ద ఉన్న గడియారం స్తంభాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గంగమ్మ గుడి నుంచి మూడు రోడ్ల కూడలి వరకు చలువ పందిళ్లు వేస్తున్నారు. జాతర నిర్వాహకులుగా గోపీనాథ్‌రెడ్డి, సోమసుందరం, మురళీ, ప్రసాద్ రెడ్డి, గంగాధరం తదితరులు ఉన్నారు.

మూడురోడ్ల కూడలిలోని టవర్‌క్లాక్‌కు విద్యుత్ దీపాల అలంకరణ

ఉపాధి పనుల వద్ద నీరు, నీడ, సౌకర్యాలను కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న రసరాయనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ, సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఉపాధి హామీ అంబుడ్స్‌మెన్ కమిటీ సభ్యుడు రసరాయనాయుడు సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారుజ. మండలంలో రోజు జరుగుతున్న ఉపాధి పనుల వివరాలను తెలుసుకుని, కూలీల హాజరు పరిశీలించారు. మస్టర్ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలీ వస్తుందని, రోజుకు 5 వేల మంది పనిచేయాల తెలిపారు. ప్రతి కూలీకి పని కల్పించాలని, వారికి కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్ల తోటల పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు సుమన్‌రావుకు అస్వస్థత

- నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం
- పట్టించుకోని జిల్లా ఎన్నికల అధికారులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమన్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని చిన్నాయగుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సుమన్‌రావు ఎన్నికల విధుల్లో అస్వస్థతకు గురై నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 12న సుమన్‌రావును గూడూరు నియోజకవర్గంలోని చెందోడు సెక్టార్ 20లో పోలింగ్ స్టేషన్ నెంబరు 176కు కేటాయించారు. ఆ రాత్రి ఆరోగ్యం పరంగా ఇబ్బందిగా ఉందని పీవోకు తెలియజేశారు. 13వ తేదీ ఉదయం విధులకు హాజరు కాగా 8 గంటల సమయంలో ఆరోగ్యం సహకరించడంలేదని తెలపడంతో స్థానిక మెడికల్ సిబ్బందిలో చికిత్స అందించినా ఫలితంలేదు. ఆయనను కోట ప్రభుత్వాస్పత్రికి ఆటోలో పంపించారు. అక్కడ సుమన్‌రావు స్పృహతప్పి పడిపోయారు. అనంతరం నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాణపాయ స్థితిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న సుమన్‌రావు బుధవారం వరకు స్పృహలోకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా ఎన్నికల అధికారులు ఆస్పత్రికి రాకపోవడం, పట్టించుకోకపోవడం దారుణమని యూటీఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు.

సత్యవేడులో టీడీపీ ఓటమి ఖాయం

- పిచ్చాటూరు వేదికగా బయటపడిన గూడుపుఠాణీ
- టీడీపీ అభ్యర్థి లేకుండానే అభినందన సభ
- స్వతంత్ర అభ్యర్థి రమేష్‌కు జై కొట్టిన టీడీపీ నేతలు
- ఆయన నుంచి భారీగా తాయిలాలు అందుకున్నట్టు ఆరోపణలు



అభినందన సభలో ప్రసంగిస్తున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు



సమావేశానికి హాజరైన టీడీపీ అసమ్మతి నేతలు

వరదయ్యపాళెం: సత్యవేడులో టీడీపీ ఓటమి దాదాపు ఖాయమైంది. పిచ్చాటూరులో బుధవారం జరిగిన అభినందన సభలో గూడుపుఠాణీ బట్టబయలైంది. ఆదిమూలం వెంట నడిచినట్టే నడిచిన మెజారిటీ టీడీపీ నేతలు స్వతంత్ర అభ్యర్థి రమేష్ నుంచి పెద్దఎత్తున తాయిలాలు అందుకుని ఎన్నికల్లో ఆయనకే జై కొట్టినట్లు బహిర్గతమైంది. దీంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం లేకుండానే శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ముఖ్య అతిథిగా, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ విషయం నియోజకవర్గంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కూడా ఒక్కసారిగా కంగు తిన్నట్లు సమాచారం. ఈ సమావేశానికి నియోజకవర్గంలో మెజారిటీ కీలక నేతలు కూడా హాజరుకావడం విశేషం. అంతేకాక పిచ్చాటూరులో జరిగిన అభినందన సభకు, మధ్యాహ్నం జరిగిన విందు భోజనానికి కూడా తెర వెనుక నుంచి స్వతంత్ర అభ్యర్థి ద్వారా ఖర్చు పెట్టినట్లు సమాచారం. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే నియోజకవర్గంలో ఆదిమూలం ఓటమికి ఆ పార్టీ నేతలే కుట్రలు పన్నినట్లు తేటతెల్లమైంది. అక్కడికి హాజరైన కీలక నేతలు సైతం పార్టీ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు ఆహ్వానం మేరకు వచ్చినట్లు సమాచారం. ఈ పరిణామాలు ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థికి మింగుడు పడడం లేదు. ఆ మేరకు పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం మండల అధ్యక్షులు తిరుమల రెడ్డి, గిరి, రామాంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇలంగోవన్ రెడ్డి, రాష్ట్ర వాణిజ్య ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు, మాజీ ఎంపీపీ మస్తాన్, మండల మాజీ అధ్యక్షుడు పరమశివం, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, మల్లికార్జునరెడ్డి, కిరణ్ యాదవ్, మునిశేఖర్ నాయుడు, తదితర కీలక నేతలు సమావేశానికి హాజరైన వారిలో ఉన్నారు.

లోకేష్‌కు ఫిర్యాదు

నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థికి కనీస సమాచారం లేకుండా పిచ్చాటూరులో అభినందన సభ నిర్వహించడంపై నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, ఆ పార్టీ కార్యదర్శి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సమావేశం నిర్వహించిన సతీష్ నాయుడు కాల్ డేటా వివరాలను సేకరించాల్సిందిగా లోకేష్ సూచించినట్లు తెలుస్తోంది.